
వేళ్ల మధ్య చుట్ట ఆరిపోయిందని శర్మగారు గుర్తించనేలేదు. పడకకుర్చీలో కూచుని ఆలోచిస్తున్నారు గజిబిజిగా ఆలోచనలు వస్తున్నాయి.... మనిషి అసలు ఇంతకాలం బ్రతక కూడదేమో!

కాని చావుబ్రతుకులు మనిషి చేతిలో లేవుగా! మనిషి ఇక్కడికి రావడమూ, ఇక్కడ ఉండడమూ- ఇక్కడ నుంచి పోవడమూ అన్నీ నిశ్శబ్దంగా భరించవలసిందే.

–సమస్యలు రావడం వేరు. మనసు కలత చెందడం వేరు. సమస్యలు తనకు కొత్తకాదు. కాని కలత.... దీనికి పరిష్కారం ఎలా?

బుగతగా బ్రతికినన్నాళ్లు మనసులో కలత రాలేదు

–భూములు పోయాయి. మేస్టరు గిరిక కుదిరి




పెంఛను పుచ్చేసుకోవటమూ జరిగింది. .

ఆదాయం పుష్కలంగా వచ్చిన రోజులూ ఉన్నాయి... రెండో వాడు కాలేజీలో చేరే సమయానికి డబ్బు ఇబ్బందులు ఎదురయ్యాయి.. ముసలితల్లి ఆరోగ్యం దెబ్బతినడం – రెండో పిల్ల పెళ్లి . చాపచిరిగి మిగిలిన చదరా అయిపోయింది ఆ రోజున కూడా మనసులో కలత కలగలేదు. గుండెలో ముల్లు గుచ్చుకున్న బాధేమనే బాధా కలగలేదు.

మార్పు సహజం... కాలం అంతా ఒక్కలా వెళ్లదు అన్నమాట ఎదురులేని నిజం.

మార్పుకి అతీతమైన విలువలు శిలాక్షరాలుగా – శిధిలం లేకుండా మిగిలిపోతాయి.

–తల్లి తన చేతిలోనే ఐదేళ్ల క్రిందట కళ్ళు మూసింది. దిన వారాలకి మునసబు దగ్గర రెండువేలు అప్పుచెయ్యాల్సి వచ్చింది. తనదగ్గర కొన్ని వందలసార్లు అప్పు తీసుకున్న మనిషి దగ్గర అప్పు తీసుకున్నప్పుడు కూడా మనసుకి కలతకలగలేదు.

రెండవవాడి చదువయిపోయి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. మారాజు పట్నం ...

పిల్లలు ఇంటికి వచ్చి పాతాలు చెప్పించుకుని పదిపాతికా ఇస్తూనే ఉన్నారు.

కాలక్షేపం జరిగిపోతోంది.

డబ్బువల్ల ఆనందంరాదు.... ఆనందం మనసులో ఉంది. గంజినీళ్లు త్రాగయినా తృప్తిగా జీవితం గడపగలిగితే అంతకంటె వేరే ఆనందం ఉండబోదు.

–ఇటీవలనే మనసులో కలత కలుగుతోంది –"ఆ! చేసెరు నిర్వాకం! నలభై తులాల బంగారం.... మా వాళ్లు బాల తొడుగుగా పెట్టిన వో పది తులాలు .. అంతా పోయింది. ఈ సంసారానికే పెట్టాను . నేను మాత్రం ఏమడిగానూ? కట్నం కాసులపేరు కావాలన్నానా? వడ్డాణం చెయించుకుంటానన్నానా?. . పిప్పి పిసరూ ఈ నలుసులకే పెట్టాను... నాదని ఒక్క వెయ్యి రూపాయలు కావాలనుకోడం తప్పా?.. పశువుకి తిన్నదిపుష్టి.... మనిషికి ఉన్నది పుష్టి అన్నారు.

శర్మగారు తరచు ఈ మధ్య ఈ మాటలు – సణుగుడు వింటూనే ఉన్నారు.

బంగారం అమ్మినమాట నిజమే.. తనే అమ్మాడు.... కాని అమ్మడం దేనికి?.... ఇద్దరు పిల్లల చదువూ పెద్ద కొంప వచ్చేవాళ్లూ, వెళ్ళేవాళ్లూ.. పెళ్లిళ్లూ పేరంటాలు.... పురుళ్లూ, పుణ్యాలు.... జబ్బులూ, చావులూ... ఏదయినా మానెయ్యగలిగింది ఉందా?

భూములున్న రోజుల్లో గాదెల నిండా ధాన్యం . ఏది కొనుక్కోనక్కరలేని పరిస్థితి .. చూస్తుండగానే భూములన్న 'హుష్' కాకి అయిపోయాయి.

బియ్యం కొనుక్కోవడమంటే తల తీసేసినట్లుండేది.

మార్పు! కాల సహజం!

పెద్దాడు దూరంగా వెళ్ళినా ... మా రాజుపట్నంలోనే దొరికింది చిన్నాడికి ఉద్యోగం .. అదెంత కాదు .. అద్దె యిత్తర తిరిపోయింది.

– వెధవ ఆస్తులు ... ఏది శాశ్వతం ... వెళ్లేటప్పుడు ఏది తీసుకుని వెళ్లలేం . బ్రతికినన్నాళ్లు భుక్తికి లోపం లేకుండా ఉంటే అంతే చాలు . ఆస్తి పోయిందన్న చింత తనకు ఏనాడూ లేదు. చింత ఉంటే మాత్రం ఆస్తి పోయిందని పోగలమా? ఇదంతే!

చిన్నవాడి భార్య కాంతం ఉద్యోగం చేస్తానని ఒకటే గోల!

'నాన్నా' రోజులు మారాయి – మీ ఎదుట మాటాడుతున్నానని మరోలా అనుకోకండి ... ఈ కాలం బ్రతుకులే వేరు .. లోగిలిలో వాలు కుర్చీమీద కూచుంటే రైతులు ఇంటికి తెచ్చి గింజలు కొలిచె రోజులు పోయాయి . ఇతరుల శ్రమ మీద బ్రతకడం కంటే మన తిండి మనం సంపాదించుకోవడం మెలు కదూ! అది మేలనుకుంటే మనం ఒళ్ళు వంచి పని చేసుకోవాలి ::: ఇంతకీ కోరి చదువుకున్న పిల్లని కట్నం లేకుండా చేసుకున్నారు మీ కోడలిగా .. మనలాగే చితికిపోయిన వాళ్లే వాళ్ళూ ... మీకు ఎంత అవగాహన ఉందో నాకు తెలుసు నాన్నా! ... దాని సంపాదన మీద ఆశ అని కాదు ... ధరలు మండిపోతున్నాయి రోజలూ అలాగే ఉన్నాయి...

ఎవరినని ఏం లాభం? ఒక్క చేతి మీద సంపాదన .. మన తిళ్లకి చాలదు . మీరూ ఆలోచించండి .. మీకు కష్టం కలిగించకూడదనే ఇన్నాళ్లూ ఊరుకున్నాను . అమ్మ ససేమిరా వీలులేదంటోంది .. ఆ బడిలో నాలుగు వందలిస్తామని మరీ మరీ నన్ను బ్రతిమాలాడు ఆయన బ్యాంకుకు వచ్చి మరి .. మనమంటె ఆ గురి ఉండబట్టే అడిగాడాయన ... మీకూ ఆయన తెలుసట . . మన ఇంట్లో వారాలు చేసుకుని చదువుకున్నాడని అమ్మ చెప్పింది.."

శర్మగారికి చివరి విషయం వినగానే విసుగు కలిగింది . మహలక్ష్మి సంగతే అంత మరిచిపోవాల్సినవి జ్ఞాపకం ఉంచుకుంటుంది. జ్ఞాపకం ఉంచుకోవాల్సిన సంగతి మరిచిపోతుంది.

'ఏదో పాతకాలం మనిషి లేరా! మన ఇంటిలో ఆడపిల్ల ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం ఈ రోజే వచ్చింది. నేను మీ అమ్మతో చెబుతాను కాని నువ్ కోడలి చేత ఓ దరఖాస్తు పడేయించు!"

– కోడలు ఉద్యోగానికి వెళుతూ వచ్చి చెప్పింది .. రెండు రోజులు మహలక్ష్మమ్మ మాటాడలేదు.

తుఫాను ముందుండే ప్రశాంతత అది.

– పెద్దాడి దగ్గర నుంచి మనీ ఆర్డరు వచ్చింది. అబ్బాయి బాంకికి, కోడలు బడికి వెళ్లారు. ఆవిడే



# కలత

వి.వి.బి.రామారావు

మనీ ఆర్డరు అందుకుంది.

"ఇది నా పేర బ్యాంకిలో వేసుకుంటా!" గదిలోకి వచ్చి రెండు మూడుసార్లు తచ్చాడి చివరకి అంది.

"ఆఁ!"

శర్మగారు పరధ్యానంగా ఉన్నారు

"పెద్దవాడు డబ్బు పంపించాడు ... ప్రతి నెలా అనుకుంటూనే ఉన్నా ... ఏ నెల కానెల అలా పులుసులో పడిపోతూనే ఉంది. నెలనెలా ఇహనుంచి ఇవో బ్యాంకిలో పడేస్తే రెండేళ్ళు తిరిగేసరికి ఓ నాలుగయిదు వేలయినా కంటబడతాయి ..."

కలత లేగిన మనసులో జ్ఞాపకాలు సుడులు తిరుగుతున్నాయి.

శర్మగారికి ఆయన తల్లి కళ్ళ ముందు మెదిలింది.

తండ్రి పోయిన కొత్త రోజులు. ఇంట్లో ఏదో వెలితి... చీకటి ... నిరుత్సాహం ... దివవు దివవు మంటూ ఉన్న ఇల్లు.

పెద్ద పొలం రైతు డబ్బు తీసుకొచ్చాడు.

"అమ్మా! ఈసారికి గింజలక్కరలేదు ... అమ్మి డబ్బు తీసుకురమ్మన్నా! రైతు డబ్బు తెచ్చాడు ... ఇదిగో ..." దొంతెడు నోట్లు ఆమెకు అందించబోయాడు.

"నాకెందుకురా ఇది?"

"అది కాదమ్మా! డబ్బు నీ దగ్గరే వుంచు ..."

"వద్దురా! ... మీ నాన్నగారు నాకెప్పుడూ డబ్బు విషయాలు చెప్పనూ లేదు ... అధవా చెప్పినా నేనెప్పుడూ పట్టించుకోనూ లేదు. ఆయనకేం పుణ్యాత్ములు ... ఆయన చేతుల మీదుగా వెళ్ళే అదృష్టం నాకు లేకపోయింది ... డబ్బు మాట నాకు చెప్పకు .. అభిషేకం చేయాల్సినా ఆయనే ఇచ్చేవారు ... అడదాన్ని ఇంత వండి పడెయ్యడం తప్ప నాకు మరేం తెలియదూ ..."

– తల్లి మాటలు పదే పదే గుర్తుకొస్తున్నాయి శర్మగారికి. అత్తగారు నాడు లేని తెలివితేటలూ, గడుసుతనమూ, ఈ వయసులో మహాలక్ష్మికి ఎలా వచ్చాయి? కోడలు జీతం కంటికి చూపడంలేదన్న అక్కసా?

కొడుకు – ఉన్నంతలో తమకి ఏం లోటు

చేస్తున్నాడు? కోడలుపిల్ల మాణిక్యం - దాని ననుకుంటే పాపం కూడాను - మరెందుకి డబ్బు యావ?

- తన సంగతా? - ఈ రోజు తను అశక్తుడు. తను ఇవ్వాలనుకున్నా భార్యకు ఏమి ఇవ్వలేడు.

బడిపిల్లలు పాఠానికి వచ్చారు.

"పెద బాబుగారూ! .. నాన్న ఇయ్యమన్నాడు" పది రూపాయల కాగితం అందించాడు కుర్రాడు

శర్మగారు లేచి సాలో చనగాలో పలకెళ్లారు.

"మహాలక్ష్మి ... ఇదిగో ఈ పది ఉంచు .. ఇలా ఇచ్చినవన్ని బ్యాంకులో వేసుకుందువుగాని ...'

ఆయన గొంతు వణుకుతోంది

"బావుంది, సంబరం' .. ఈ పది, ఐదూ ఎందుకు? కాలంనాటి పిల్లలున్నారు నాకు .. డబ్బు గడుసుతనం తెలిస్తే ఇప్పుడు పుస్తెలోక పూసలేకుండా ఉండేదాన్నా' ... నాకక్కరలేదు.

ఆవిడ రుస రుసలాడింది

అక్కడే వదిలేసిన పది కాగితం గాలికి రెప రెపలాడింది.

- కోడలు స్కూలు నుంచి వచ్చి అత్తగారి మాటలు వినిందేమో రాత్రి భర్తతో చెప్పింది

- 'చూడు కాంతం! అమ్మలో ఏదో అసంతృప్తి ... ఏదో మార్పు నువ్ ఉద్యోగం చెయ్యడం అమ్మకిష్టంలేదు .. పోనీ మానేస్తే? .. చేసినా నీ జీతం అమ్మకి ఇచ్చేస్తే?"

"అదేమిటండి? ఆవిడకు నా జీతం కావాలా? ... నా జీతం ఏమాత్రం ... నాదైతే మాత్రం నేనే తినేస్తున్నానా? ... మీరూ అలా అంటే ఏం చెయ్యనండి! మీదైనా, నాదైనా, మన సంసారం కోసమే కదా . మీ ఒక్కరి జీతంతో ఏం లాగగలం ఈ రథం? .. మరొక మాట! .. నాకు మాత్రం ఇంటి పట్టున ఉండాలని లేదంటారా? ... నేను చీర



కట్టుకుంటుంటే బయటకు వెళతానని తెలిసి గుక్కపట్టేస్తోంది పెద్దది . చంటి వెధవ సరేసరి .. నేనేం చెయ్యను ... బడి వదలి రాగలనా? మీరు చెప్పండి ... మీరు మానెయ్యమంటే మానేస్తా!"

- ఆమె కళ్లు తుడిచాడు శాస్త్రి

అమ్మ ఇలా అయిపోతుందేమిటి? ఈ సమస్యకి పరిష్కారం ఎలా? ఎప్పుడూ తనని వెనకవేసుకువచ్చే అమ్మ - తనకి శత్రువైపోయిందా? ఇదంతా డబ్బు మహామేనా?

- గబగబా రెండు ముద్దలు మింగి మాటాడకుండా ఆఫీసుకు వెళ్లిపోయాడు

- సాయంకాలం అడిగాడు మిత్రుడు ఎంట్రా అలా ఉన్నావ్! అని ..

"ఏదో కలితలేమ్రా! ఏం చెస్తాం...పెద్దవాళ్లకి కూడా ఈ రోజుల్లో- ఎప్పుడూ లేనివాళ్లకు కూడా - డబ్బు యావ పెరిగిపోతుంది. డబ్బు బాగా ఉన్న రోజుల్లో డబ్బు జోలికి వెళ్లని అమ్మకి ఇప్పుడు దాచుకోవాలనిపిస్తోంది ఎలా? మనకి ఎంత డబ్బా తిళ్లకే చాలదు ఇప్పుడు దాచుకోవాలంటే ఎలా?"

"అసలేమయిందిరా?"- శాస్త్రి వివరంగా చెప్పాడు.

"సరే! ఒక్క పని చెయ్యి ." మిత్రుడు చెప్పిన మాటలు శాస్త్రికి నచ్చాయి

మొదటి తేది వచ్చింది. ఇంటికి రాగానే అడిగాడు కాంతాన్ని జీతం వచ్చిందా అని.

"ఆఁ!" అంది కాంతం.

"ఇదిగో కాంతం నా జీతం... నీది, నాది కలిపి అమ్మకిచ్చెయ్' ఆవిడకు పెత్తనం ఇచ్చెయ్'ఖర్చులు పోను మిగిలినది బ్యాంకులో వేసుకోమను ...?

"బ్యాంకులో నా? ఖర్చులు పోను మిగిలితేగా?"

'నా మాట విను "

"మీ మాట కాదాననండి!.. ఇదిగో మొత్తం, మీరే ఇచ్చెయ్యండి.. నేనెలాగయినా ఫైదానినే. మీరే చెప్పండి అత్తయ్య గారితో నా జీతం ఆవిడకు ఇయ్యడానికి నాకు అభ్యంతరం ఏ మాత్రం లేదు కానీ ఆవిడ నన్ను ప్రేమగా చూసుకోవాలని మాత్రమే ఉంది.. కాని డబ్బు మిగలదే..."

"ఇలాతే!"

డబ్బు తీసుకుని తల్లి దగ్గరకు వెళ్లాడు శాస్త్రి.

"ఏంరా?" ఒత్తులు చేసుకుంటున్న మహాలక్ష్మమ్మ అడిగింది.

"ఇదిగోనమ్మా.. ఇది నా జీతం... ఇది నీ కోడలి జీతం... నీ దగ్గరే ఉంచు. ఇంటి ఖర్చులూ అవి నువ్వే యజమాయిషి చెయ్యి.. ఇద్దరం ఇంట్లో ఉండం కదా... మొత్తం డబ్బు విషయమంతా నువ్వే చూసుకో ఏ మాత్రం మిగిలినా నెలనెలా బ్యాంకులో వేసుకుందువు గాని.. నీ కడుపున పుట్టినవాడిని. నా మీద కోపం తెచ్చుకోకమ్మా"

తల్లి చేతిలో డబ్బు ఉంచేసి తన గదిలోకి వచ్చి కూచున్నాడు శాస్త్రి.

"అమ్మయ్య' ఇప్పుడు మనసు తేలికగా ఉంది' అన్నాడు కాంతం వంక చూస్తూ.

"నిజమే సుమండీ' మనసులో కలత లేకపోతే ప్రాణానికి హాయిగా ఉంది' అంటూ మంచం మీద కూచుంది కాంతం.

డబ్బు పుచ్చుకుంది కాని ఆ క్షణం నుంచి మహాలక్ష్మమ్మ మనసు మనసులో లేదు. ఏ నాడూ ఇంట్లో ఇది కావాలి అని చెప్పడమే కాని దాని ఖరీదు - కొనుబడి ఇవేమి తను తెలుసుకోలేదు. నెలకి ఖర్చు ఎంత వుంది? అసలు ఏమేం కొనాలి? ఆలోచించి ఆలోచించి పెన్సిలూ కాగితమూ తెచ్చుకుని ఏవేవో రాసి కొట్టేస్తోంది. ఆవిడ మనసులో ఏవేవో ఆలోచనలు. బెంగ.

గంటయినా మహాలక్ష్మమ్మ కంట పడకపోయే సరికి శర్మగారికి ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి.

పెరట్లో లేదు భార్య. దేవుడి గదిలోనూ లేదు. కంగారు పుట్టింది ఆయనకు. వంటింట్లోకి వెళ్లారు.

కళ్లు చిట్లించుకుని కాగితం మీద ఏవో రాస్తోంది మహాలక్ష్మమ్మ

"ఏం మహాలక్ష్మి ఏం చేస్తున్నావ్?"

ఆమె దొంగతనం చేస్తూ పట్టుబడినట్టు తుళ్లిపడింది. భర్తను చూస్తూనే కళ్లలో నీళ్లు నింపుకుంది.

'ఏం? అబ్బాయి ఏమైనా. .."

"ఛ , ఛ! అదేం కాదు.. వాడు డబ్బు నా చేతిలో నే పోశాడు .. ఏమండి . ఏమి అనకండి.. ఇది మీ దగ్గరే ఉంచండి ... ఇదిగో పెద్దాడు పంపింది కూడా!'

ఆవిడ నోట్లు తన కందించబోతూ ఉంటే గోముగా భార్య చేతులు పట్టుకున్నారు శర్మగారు

"కోడలు పిల్ల చూస్తే తల కొట్టేసినట్టుంటుంది!' అంది ఆవిడ కళ్లలో వెలుగు నింపుకుంటూ. □

